ప్రజావాణిలో ఫిర్యాదులు



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న డీసీ శశిరేఖ

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్ శశిరేఖ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగానికి మూడు ఫిర్యాదులు వచ్చాయని, సంబంధిత అధికారులు ఆ సమస్యలను పరిష్కరించాలని డీసీ ఆదేశించారు. ప్రజలు ఎల్లప్పుడు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి, ఇంజినీరింగ్ డీఈ దుర్గప్రసాద్, శానిటేషన్, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరుడు



గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో

రాయదుర్గం: శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు పూజలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గచ్చిబౌలిలోని అన్ని శైవ ఆలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి.

వైభవంగా ఫలహార బండి ఊరేగింపు



ఫలహార బండి, తొట్టెల ఊరేగింపులో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో ఫలహార బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా ఆదివారం రాత్రి నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుల మోతలు, యువత కేరింతలతో ఊరేగింపును కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిరుధ్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్ లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

కొండాపూర్ కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ అపర్ణ



గచ్చిబౌలి: తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కొండాపూర్ కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ అపర్ణ అన్నారు. కొండాపూర్ కిమ్స్ హాస్పటల్‌లో సోమవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే మాతృశిశు సంరక్షణలో భాగంగా తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

'జీఐఎల్‌టీ'లో స్పాట్ అడ్మిషన్స్

రాయదుర్గం: లెదర్ టెక్నాలజీలో తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక పాలిటెక్నిక్ కళాశాలగా గుర్తింపు పొందిన గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజి (జీఐఎల్‌టీ)లో ఖాళీ సీట్ల భర్తీకి శ్రీకారం చుట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశం ప్రకారం 'స్పాట్ అడ్మిషన్'ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ సోమవారం తెలిపారు. జీఐఎల్‌టీలో సీటు పొందాలంటే పాలిసెట్ అర్హత సాధిస్తేనే అవకాశం ఉండేది. కానీ పదవ తరగతి పాసైనా సీటు కేటాయించి ఖాళీ సీట్లను భర్తీ చేయాలని ఆదేశించారని ఆయన వివరించారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 5 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సువర్ణలత సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఆటోమొబైల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీలకు స్పాట్ అడ్మిషన్‌లు ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. మొదటి రెండు రౌండ్లలో సీట్లు పొందని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 5 నుంచి 7 వరకు దరఖాస్తుల స్వీకరణ 7న సాయంత్రం మెరిట్ ఆధారంగా స్పాట్ అడ్మిషన్‌లు కల్పిస్తామన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

● సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ● హఫీజ్‌పేట్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనూషతో 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూ



చందానగర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని... ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని... ఇంట్లో వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని.. వైద్యులు చెప్పినట్లు తప్పకుండా పాటించాలని హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అనూష పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?

జవాబు: వర్షాకాలంలో వాతావరణం మార్పులో భాగంగా ప్రతి ఇంట్లో జలుబు, దగ్గు వ్యాధులు వస్తుంటాయి. నిత్యం గోరు వెచ్చని త్రాగునీటిని తీసుకోవాలి. ఇంటి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి.

ప్రశ్న: ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు.

జవాబు: హఫీజ్‌పేట్ ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర విభాగ సేవలు, ఓపీ రోగులకు వైద్య పరీక్షలు, గర్భవతులకు మెటర్నీటీ వార్డు, అన్ని రకాల రక్త పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. రక్త పరీక్షలు చేసిన నమూనాలను తెలంగాణ డైయాగ్నాస్టిక్స్‌కు పంపించి రెండు రోజుల తరువాత రిపోర్టులు ఇస్తారు.

ప్రశ్న: ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జవాబు: హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు సుమారు 100 మందికి నెలకు 2500 మందికి వైద్య పరీక్ష చేస్తున్నారు. వైద్య సేవలు అందించడానికి ఒక మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్స్, ఒక డీఈఓ, అకౌంటెంట్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

ప్రశ్న: సీజనల్ వ్యాధులు ఏంటివి ? అవి ఎలా నిర్మూలించవచ్చు.

జవాబు: సీజనల్ వ్యాధులలో ప్రతి ఒక్కరికి జలుబు, దగ్గు, జ్వరం, స్కిన్ వంటి వ్యాధులు సోకుతాయి. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపిస్తాయి. శుభ్రంగా లేని నీటి ద్వారా టైఫాయిడ్, డయేరియా జ్వరాలు వస్తాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వీటిని దూరం చేయవచ్చు.

ప్రశ్న: బస్తీలలో ప్రజలకు పరిశుభ్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.



నీటి నిల్వలు ఉంచకుండా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న వైద్య సిబ్బంది (ఫైల్)

జవాబు: వాతావరణం మార్పులో భాగంగా బస్తీలలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు నీటి నిల్వలు ఉండకుండా కాలనీ, బస్తీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెరువులు, కుంటల వద్ద యాంటి దోమ లార్వే పిచకారి చేయడం, దోమల నివారణకు ఫాగింగ్‌పై తెలియజేస్తున్నాం. అంతే కాకుండా రోడ్లపై చెత్త చెదారం వేయకుండా అవగాహన కల్పిస్తున్నాం.

వ్యవసాయ రక్షణకు ఉద్యమాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

మియాపూర్: రైతుల వ్యవసాయ రక్షణకు బలమైన ఉద్యమాలే ఏకైక శరణ్యమని, ఆ దిశలో రాజకీయాలకతీతంగా రైతాంగాన్ని ఐక్యపరచాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవంలో భాగంగా మియాపూర్‌లోని ఎంఏనగర్ కార్యాలయంలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతాంగ ఉద్యమాలు, ఓంకార్ అంశంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మద్దికాయల ఓంకార్ తన జీవితాన్ని వివిధ ప్రజల విముక్తికోసం త్యాగం చేశారన్నారు. దున్నేవాడికే భూమి కావాలని వేల ఎకరాలు పేదలకు దక్కేలా కృషి చేశాడని తెలిపారు. మద్దికాయల ఆదర్శాలు, స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాల విధానాలను నిరసిస్తూ ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి అనీల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంభం సుకన్య, తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి, అంగడి పుష్ప, నాయకులు దశరథ్ నాయక్, లక్ష్మి, అనిత, సుల్తానా బేగం, రజీయాబేగం, శివాణీ, లాలయ్య, దేవనూరు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాటు చేశారు.. ప్రారంభం మరిచారు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని ప్రజల, కార్మికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. పారిశ్రామికవాడలోని సర్వేనం.10లో పరిశ్రమలో సాకారంతో రెండేళ్ల క్రితం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అందుబాటులోని తీసుకురావడం మరిచారు. పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికులకు అక్కడే నివాసముంటారు. కార్మికులకు తాగు నీటి సమస్య ఉంది. గడ్డపోతారం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మున్సిపాలిటీగా మారి ఏడాది కావస్తున్నా దుమ్ము ధూళి పడి నిరుపయోగంగా ఉండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

వెచ్చించి ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ప్లాంట్ అందుబాటులోకి తీసుకువస్తే కార్మికులకు తాగు నీరు నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు.

'జైలుకు వెళ్లొచ్చినా బుద్ధి మారలేదు'

● చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్ ● రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మియాపూర్: ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని సోమవారం మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేశ్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ ఈస్ట్ గోదావరి జిల్లా వనసపాకల కారాప మండలం కొత్తపేటకు చెందిన మేడిశెట్టి గణపతిరావు(40) మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీలో ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూనే చోరీలకు పాల్పడుతూ వచ్చిన డబ్బును జల్సాలకు వాడుకుంటున్నాడు. ఇప్పటికే అతడిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. గతేడాది పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. మళ్లీ దొంగతనాలకు పాల్పడడం ప్రారంభించాడు.



మియాపూర్ పోలీసుల అదుపులో నిందితుడు

◆ ఈ క్రమంలో మియాపూర్ మదీనాగూడ మైత్రి నగర్ కాలనీకి చెందిన ఎం. రవి ఇంట్లో గత నెల 23న తాళాలు పగులగొట్టి విలువైనా పత్రాలతో పాటు ద్విచక్రవాహనాన్ని దొంగిలించాడు. దీంతో బాధితుడు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా ఈ నెల 30న దత్తనారాయణ పీఠంలోని దేవత విగ్రహాలకు ఉన్న మంగళసూత్రం, అమ్మవారి వెండి, బంగారు వస్తువులను దొంగిలించాడు. దీంతో ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మేడిశెట్టి గణపతిరావును అదుపులోకి తీసుకొని విచారించారు. మైత్రినగర్‌తో పాటు దత్త నారాయణపీఠంలో దొంగతనాలకు పాల్పడింది తానేనని అంగీకరించాడు. మియాపూర్ పోలీసులు అతని వద్ద ఉన్న ద్విచక్రవాహనం, ఇంటి పత్రాలు, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనారోగ్య సమస్యలు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

చందానగర్: గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం, కన్నాపూర్ గ్రామానికి చెందిన కాటం గోవిందరెడ్డి కూతురు దండ శోభ (36)కు 14 ఏళ్ల క్రితం అమరేందర్‌రెడ్డితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. 11 ఏళ్లుగా చందానగర్‌రెడ్డి కాలనీలో ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న శోభ ఈనెల 1న రాత్రి 10.30 గంటలకు పురుగుల మందు తాగింది. ఇది గమనించిన భర్త వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆమెను తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



రామకృష్ణ(ఫైల్)

మియాపూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ పర్వీద్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం .. కూకట్‌పల్లి హైదర్‌గూడకు చెందిన తుమ్మల రామకృష్ణ(45) భార్య షర్మిల, పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గతనెల 5న మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ - హఫీజ్‌పేట మార్తాండ నగర్‌లో ఉంటున్న అతని మేనమామతో మాట్లాడేందుకు వచ్చాడు. మాట్లాడి వెళ్లిన తర్వాత ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తన సోదరుడు రవి కిరణ్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో తన అన్న రామకృష్ణ కనబడటం లేదని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఆల్విన్‌కాలనీ: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, హెచ్‌పీ పెట్రోల్‌బంక్ నుంచి పైపులైన్ రోడ్డు కల్వర్టు వరకు, ఏఎస్ రాజు నగర్ కాలనీలో రూ.1.49 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నూతన రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, ఎర్రబెల్లి సతీష్‌రావు, వివేకానందనగర్ కాలనీ అధ్యక్షులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఏఎస్‌రాజు నగర్ అధ్యక్షులు నర్సింహారావు, కమల ప్రసన్న నగర్ అధ్యక్షులు శేఖర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్1 అధ్యక్షులు వెంకటేశ్ గౌడ్, సొసైటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



సమావేశంలో పాల్గొన్న ఫ్యాకల్టీ ప్రతినిధులు

రాయదుర్గం: నేటి విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని అందించడమే కాకుండా ఆవిష్కరణ, స్వావలంబనను కూడా ప్రారంభించాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ-ఎంఎంటీటీసీలో నిర్వహించిన స్వావలంబన మహిళా వ్యవస్థాపక కార్యక్రమం కింద కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ సహకారంతో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్ ఫలదాయకమైన కెరీర్‌ను అన్వేషించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఐఈఎస్ బీయూడీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ యామినిజైస్వాల్, యూజీసీ-ఎంఎంటీటీసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్‌ముబార్కి, డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క



గంగారంలో అమ్మ పేరుతో మొక్కను నాటుతున్న బీజేపీ ప్రతినిధులు

చందానగర్: అమ్మ పేరుతో ఒక మొక్క, ప్రకృతికి మన పూచిక అనే కార్యక్రమం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో బీజేపీ నాయకులు ప్రారంభించారు. సోమవారం డివిజన్ పరిధిలోని గంగారం గ్రామం రోడ్డు, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి ఆనంద్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు జితేందర్, ప్రధాన కార్యదర్శి రాజు ముదిరాజ్‌లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ప్రేమించడం మన సంస్కృతిలో భాగమని, అందరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దేవానంద్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి అజిత్ సేనాపతి, మాజీ కౌన్సిలర్ రమణయ్య, సత్యనారాయణ రాజు, జగదీశ్వర్‌గౌడ్, రాజు యాదవ్, సుభాష్, శ్రీనివాస్, బాలరాజు, మహేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అవధూత్ కులకర్ణి, బూత్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో 36 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. కాలనీలో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి, ప్రభుత్వ పని తీరు గురించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మహిళలకు ఉచిత బస్, ఉచిత కరెంట్, గ్యాస్, సన్నబియ్యం వంటి పథకాలతో ప్రజలు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, సిహెచ్. భాస్కర్, జాన్, శ్యాముల్, మహేష్, బషీర్, విక్రమ్, ఆయుబ్, నరేష్, రఫీ, పాషామియా, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఈఎస్ఐసీ హెల్త్‌క్యాంప్



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఈఎస్ఐ చందా చెల్లిస్తున్న కార్మికులకు కార్మిక రాజ్య భీమా సంస్థ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ సురేష్ కుమార్ చవాన్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాధిక(సనత్‌నగర్) సహకారంతో ఉచిత ఆరోగ్య క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్మికులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్, కంటి పరీక్షలు, వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్మికుల కోసం క్యాంప్ ఏర్పాటు చేయడంపై శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో కష్టపడి చదవాలి

● మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్
● మనూలో విజిట్ ఉర్దూ యూనివర్శిటీ కార్యక్రమం మరూ



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: విద్యార్థులు అంకితభావంతో కష్టపడి చదవాలని మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విజిట్ ఉర్దూ యూనివర్సిటీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. డీన్ అలుమిని అఫైర్స్, మనూ పూర్వ విద్యార్థుల సంఘం(ఎంఏఏ) హైదరాబాద్ చాప్టర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల ఉర్దూ మీడియం ఉర్దూ మీడియం విద్యార్థుల కోసం మనూ ఎనిమిది నెలల పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్న కోర్సులో ప్రవేశం పొందడానికి విద్యార్థులు అంకితభావంతో కష్టపడి చదవాలన్నారు. మనూలో విద్యార్థుల సంఖ్య పెంచాలనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం రెగ్యులర్ కోర్సుల కోసం ఎంతో ప్రచారం చేశారు. వారి కృషి ఫలితంగా ఈ ఏడాది విద్యార్థుల నమోదు సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఆజాద్ దినోత్సవ వేడుకలకు పాఠశాల పిల్లలను కూడా ఆహ్వానించాలన్నారు. తద్వారా వారు మనూలో జరిగే సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను చూసి ఆనందించవచ్చన్నారు. అనంతరం మనూ దూర విద్యా ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులతో పాటు వచ్చిన పాఠశాల ఉపాధ్యాయులను రిజిస్ట్రార్ ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల వ్యవహారాల సమన్వయకర్త ప్రొఫెసర్ సయ్యద్ నజ్ముల్ హసన్,ఎంఏఏ అధ్యక్షుడు న్యాయవాది ఐజాజ్‌అలీ ఖురైషి, పీఆర్ఓ డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ సర్వారీ, ఎంఏఏ జనరల్ సెక్రెటరీ నాసిర్ హుస్సేన్ షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధి అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ దేవాలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక ప్రార్థన మందిరాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. అలాగే జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా, బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి పాల్గొని పూజాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.